ప్రవేశిక

"ఎండిన మ్రోడులే కిసలయించెనొ! ఏకశిలాపురమ్ములో
బండలు పుల్కరించెనొ! అపారముదమ్మున తెల్గు తల్లికిన్
గుండెలు పొంగిపోయి కనుగొల్కులు నిండెనొ, పచ్చిపైరులే
పండెనొ! జాలువారిన భవత్కవితామృత వర్షధారలన్!!"

అవును. పోతన్నగారి లేఖిని నుంచి అమృతవర్షం కురిసింది. ఆయన కవితాసుధారసధారలు అనంతశక్తి సంపన్నమైనవి. ఆయన రచనా రామణీయకాలు అంతటి మహిమాన్వితమైనవి. వాల్మీకి వ్యాసకృతాలైన రామాయణ, భారత, భాగవతాలు భారతీయ సంస్కృతికి మూలకందాలు. ఈ త్రయీసంపద ఆంధ్రభాషలో సంతరించుకొన్నంత సర్వతోముఖసమృద్ధి మరే భాషలోనూ అందుకోలేదనటంలో అతిశయోక్తి లేదు.

మీ సాహిత్యంలో గొప్పగ్రంథాలు ఏమిటని ఒక తమిళ సోదరుణ్ణి ప్రశ్నిస్తే "కంబ రామాయణం"అని చటుక్కున సమాధానం చెబుతాడు. అదే ప్రశ్న ఒక కన్నడ సోదరుడికి వేస్తే వెంటనే "పంప భారతం" అంటాడు. అలాగే ఒక హిందీ సోదరుణ్ణి అడిగితే "తులసీ రామాయణం"అని జవాబు వస్తుంది. ఇక ఒక తెలుగువాణ్ణి "మీ భాషలో గొప్ప గ్రంథాలు ఏవి?" అని అడిగితే వాడు ఏ మాత్రం తడుముకోకుండా "కవిత్రయంవారి భారతం, బమ్మెర పోతన్నగారి భాగవతం, బుద్ధారెడ్డి రంగనాథరామాయణం"అని చకచకా చెప్పేస్తాడు.

భారతం ఒక మహేతిహాసం. భాగవతం ఒక మహాపురాణం. రామాయణం ఒక మహాకావ్యం. ఇంతటి సంస్కృతి సంపన్నమైన సాహితీ సమృద్ధి, సారస్వత సంపద తెలుగు భాషలో తప్ప మరే ప్రాంతీయ భాషలోనూ కనిపింపదు. ఆంధ్రభాషలో అనూదితాలైన భారత, భాగవత, రామాయణాలలో విశేషప్రచారం సంపాదించుకున్నది బమ్మెరవారి భాగవతం అనటంలో సందేహం లేదు.

తమిళం, మలయాళం, కన్నడం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, ఒరియా, అస్సామీ, పంజాబీ మొదలైన ప్రాంతీయ భాషలలో ఆ యా కవులచేత భాగవతం అనువదింపబడినప్పటికి ఆ అనువాదాలు సమగ్రంగా కాక ఏకదేశంగానో, సంగ్రహంగానో కనిపిస్తాయి. కొన్ని స్కంధాలు మాత్రమే కొందరు, కొన్ని ఘట్టాలు మాత్రమే కొందరు అనువాదం చేశారు. హిందీలో సూరదాసు రచించిన "సూరసాగర్"అనే మహా గ్రంథం భాగవతంలోని దశమస్కంధానికే అత్యంత ప్రాధ్యానమిచ్చి తక్కిన స్కంధాలలోని కథ చాలా సంక్షిప్తంగా వర్ణించింది. అందువల్ల అది వ్యాసుని భాగవతానికి సరియైన అనువాదం అని చెప్పటానికి అవకాశం లేదు.

సర్వాంగసుందరంగా రసభావబంధురంగా భక్తి శృంగార సంగమంగా సహృదయహృదయంగమంగా సంస్కృత భాగవతాన్ని అనువదించిన అదృష్టం పోతన్నగారికే దక్కింది. అటువంటి అవకాశం తెలుగు భాషకే చిక్కింది.

పోతన భాగవతం ఆంధ్రజాతికి ఆబాలగోపాలానికి ఆరాధ్య గ్రంథమైనది. ఒక్క తెలుగుదేశంలోనే కాదు ఛత్రపతి శివాజీకి గురుదేవుడైన సమర్థ రామదాసస్వామి పోతన భాగవతం చదివి పోతన భక్తి

ప్రపత్తులను "దాసబోధ"అనే గ్రంథంలో బహుధా ప్రశంసించాడు. ఆధునిక తమిళ సాహిత్య యుగప్రవక్త సుబ్రహ్మణ్యభారతి "సిల కవియరశర్"అననే వ్యాసంలో బమ్మెరవారిని అనేక విధాలుగా కొనియాడాడు. నారద మహర్షి అవతారంగానూ, నాదబ్రహ్మోపాసకుడుగానూ, వాగ్గేయకార శిరోమణిగానూ ప్రసిద్ధిగాంచిన త్యాగరాజస్వామి బమ్మెరవారి భాగవతాన్ని ప్రతిదినమూ భక్తిపూర్వకంగా పారాయణం చేసేవాడని చెబుతారు. అది యిప్పటికీ తిరువయ్యారులో త్యాగయ్య గృహంలో దేవతార్చన పేటికయందు పదిలపరచబడి ఉన్నదని ఆర్యుల అభిభాషణ. సంగీత సాహిత్య సరస్వతియై అష్టభాషా పండితుడై హరికథాపితామహుడైన ఆదిభట్ట నారాయణదాసుగారు తన బాల్యంలోనే పోతన భాగవతంలోని పద్యాలన్నీ అప్పగించేవారనీ అందుకని ఆయన అయిదవయేట ఆంధ్రమహాభాగవతంతోనే ఆయనకు అక్షరాభ్యాసం చేశారనీ పెద్దలంటారు.

పోతన్నగారికంటె తరువాతివారైన వల్లభాచార్యులు, చైతన్య ప్రభువు పోతన భాగవతంవల్ల ప్రభావితులైనారన్న ఆచార్య నిడుదవోలు వేంకటరావుగారి అభిప్రాయం గమనింపదగింది. వల్లభాచార్యులు తెలుగువాడే అయినందువల్ల చైతన్య ప్రభువు తెలుగుదేశంలో సంచరించాడనటానికి తగిన ఆధారాలు ఉన్నందువల్ల నిడుదవోలువారి అభిప్రాయం సమంజసంగానే తోస్తున్నది.

భాగవతం పన్నెండు స్కంధాల గ్రంథం. దశమస్కంధంలో శ్రీకృష్ణుని చరిత్రం సర్వాంగసుందరంగా అభివర్ణింపబడింది. చిత్రమేమంటే ప్రథమ స్కంధంలో శ్రీకృష్ణ నిర్యాణం చెప్పబడింది. ఇది పైకి చూడటానికి కొంచెం విరుద్ధంగానే కనబడుతుంది. అందుకు కారణం లేక పోలేదు.

భాగవత మహాగ్రంథానికి వక్త శుక మహర్షి. శ్రోత పరీక్షిన్మహారాజు. పరీక్షిత్తును రంగంమీదకు రప్పించటానికి శ్రీకృష్ణ నిర్యాణగాథ ఆవశ్యక మయింది.

అర్జునుడు ద్వారక నుంచి వచ్చి ధర్మరాజుకు కృష్ణనిర్యాణ వార్త వినిపిస్తాడు. ధర్మరాజు ఆ వార్త విని విషాదంతో విరక్తుడై అభిమన్యునందనుడైన పరీక్షిత్తును పట్టాభిషిక్తుణ్ణి చేసి తమ్ములతో ద్రౌపదితో మహా ప్రస్థానానికి వెళ్లుతాడు. మహారాజైన పరీక్షిత్తు వేటకోసం వెళ్ళి దాహార్తుడై శమీక మహర్షి మెడలో చచ్చిన పామును వేసి తిరిగి రాజధానికి చేరుకుంటాడు. మహర్షి కుమారుడైన శృంగి మహారాజును ఘోరంగా శపిస్తాడు. ఏడు దినాలలో తనకు మృత్యువు తప్పదని తెలుసుకున్న పరీక్షిత్తు పవిత్ర గంగాతీరంలో ప్రాయోపవిష్టు డవుతాడు. భగవానుడైన శుకమహర్షి పరీక్షిత్తు దగ్గరకు వస్తాడు. మహారాజు మహర్షికి సాష్టాంగనమస్కారం చేసి ఏడు దినాలలో మోక్షం సాక్షాత్కరించే ఉపాయం చెప్పమని ప్రార్థిస్తాడు. ఈ విధంగా ప్రథమ స్కంధం ముగుస్తుంది.

ఇక ద్వితీయ స్కంధం. శ్రీశుకుడు రెండు గడియలలో కైవల్యాన్ని సంపాదించిన ఖట్వాంగుని వృత్తాంతం చెప్పి "నీకు ఏడుదినాలు గడువు వుందికదా! తప్పకుండా మోక్షపదాన్ని అందుకుంటావు"అని పరీక్షిత్తుకు ధైర్యం చెబుతూడు. భక్తి మార్గమే ప్రధానమని పలికి భాగవతతత్త్వాన్ని ఉపదేశిస్తాడు.

శ్రీమన్నారాయణుని లీలావతారాల అభివర్ణనం ఈ స్కంధంలో ప్రధానమైన విషయం. భాగవత స్వరూపం శ్రీమన్నారాయణునివల్ల బ్రహ్మదేవునికీ, బ్రహ్మవల్ల నారదునికీ, నారదునివల్ల వ్యాస మహర్షికీ, వ్యాసమహర్షివల్ల శ్రీశుకునికీ సంప్రాప్తమయింది. ఆ భాగవత తత్త్వాన్ని శ్రీశుకులు పరీక్షిన్మహారాజుకు వివరిస్తారు.

ఇప్పుడు తృతీయ స్కంధంలోకి వచ్చాము. ఇందులో విదుర మైత్రేయ సంవాదం, హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతం, జగత్కంటకుడైన హిరణ్యాక్షుని శ్రీమహావిష్ణువు యజ్ఞవరాహావతారం ధరించి సంహరించటం, దేవహూతి కర్దముల దాంపత్యం, కపిల దేవహూతి సంవాదం మొదలైనవి ప్రధాన ఘట్టాలు.

తెలుగు భాగవతానికి ఇంతటి దీప్తి, వ్యాప్తి రావటానికి సహజ పాండిత్యుని సహజసుకుమారమైన శయ్యా సౌభాగ్యం, భావావేశం, భక్తి పారవశ్యం ప్రధాన హేతువులు. అర్థగాంభీర్యమూ, శబ్దసౌందర్యమూ బాలరసాల సాల నవపల్లవ కోమలమైన పోతన్నగారి కావ్యకన్యకకు పెట్టని సొమ్ములు. వాగర్థాలు పార్వతీ పరమేశ్వరులవలె బమ్మెరవారి కవిత్వంలో కలసి మెలసి ఉంటాయి.

అర్థ గాంభీర్యము !

కౌరవసభలో ధృతరాష్ట్ర మహారాజుకు హితబోధ చేస్తున్న విదురుని పలుకులు గమనించండి.

అట్టి జగన్నివాసుఁడు మురాసురభేది పరాపరుండు చే
పట్టి సఖుండు వియ్యమును బాంధవుఁడున్ గురుఁడున్ విభుండునై
యిట్టలమైన ప్రేమమున నెప్పుడుఁ దోడ్పడుచుండు వారలన్
జుట్టన వ్రేల నెవ్వరికిఁ జూపఁగ వచ్చును బార్థివోత్తమా! (3-31)

ఈ సందర్భంలోనిదే మరొక పద్యం -

ధరణీనాయక! పాండు భూవిభుఁడు నీ తమ్ముండు దత్పుత్త్రులన్
బరిరక్షించిన ధర్మముం దగవునుం బాటిల్లు, వంశంబు సు
స్థిర సౌఖ్యోన్నతిఁజెందు, శత్రుజయమున్ జేకూరు, గోపాల శే
ఖరు చిత్తంబును వచ్చునట్లగుట యో కౌరవ్య వంశాగ్రణీ! (3-24)

వైకుంఠంలోని వాసుదేవుని వర్ణనం ఈ పద్యంలో చిత్తగించండి.

వరవైకుంఠము సారసాకరము; దివ్యస్వర్ణ శాలాంక గో
పుర హర్మ్యావృతమైన తద్భవన మంభోజంబు; తన్మందిరాం
తరవిభ్రాజిత భోగి కర్ణిక; తదుద్యద్భోగ పర్యంకమం
దిరవొందన్ వసియించు మాధవుఁడు దా నేపారు భృంగాకృతిన్. (3-513)

లోకకంటకుడైన హిరణ్యాక్షుని సంహరించటంకోసం అవతరించి అవార్యశౌర్యంతో మారులేని విహారం చేస్తున్న ఆదివరాహమూర్తిని పోతన్నగారు ఈ క్రింది సీసపద్యంలో సహజసుందరంగా అభివర్ణించారు.

తుద మొదళ్లకుఁ జిక్కి తునిసి పాఱఁగ మోరఁ గులశైలములఁ జిమ్ముఁ గొంత తడవు
బ్రహ్మాండభాండంబు పగిలి చిల్లులు వోవఁ గొమ్ములఁ దాటించుఁ గొంత తడవు
జలధు లేడును బంకసంకులంబై యింక ఖురముల మట్టాడుఁ గొంత తడవు
ఉడురాజు సూర్యుండు నొక్కమూలకుఁ బోవఁ గుఱుచవాలముఁ ద్రిప్పుఁ గొంత తడవు
గునియుఁ గుప్పించు లంఘించుఁ గొప్పరించు నెగయు ధరఁ ద్రవ్వుఁ బొటియఁగా నేపు మిగిలి
దానవేంద్రుని గుండెలు దల్లడిల్లఁ బంది మెల్లన రణ పరిస్పంది యగుచు. **(3.637)**

శబ్ద సౌందర్యము :

అర్థ గాంభీర్యముతో కూడిన శబ్ద సౌందర్యము సుమనో మనోజ్ఞంగా ఉంటుంది. పోతన్న గారికి అంత్యానుప్రాసాలతో పద్యాన్ని హృద్యంగా నడపటం వెన్నతో పెట్టిన విద్య. శ్రీహరి పాదాలను ఈ క్రింది చంపకమాలతో అలంకరించాడు. వైకుంఠంలో సనక సనందనాదులు గోవిందుని సందర్శించిన సందర్భమిది.

సునిశిత భక్తిఁ దన్ముఖముఁ జూచిన చూడ్కులు ద్రిప్పలేకయుం
గనుఁగొని రెట్టకేలకు నకల్మష భక్త విధూత ఖేదముల్,
మునిజన చిత్త మోదములు, ముక్తినివాస కవాట భేదముల్,
వినుత వినూత్న నూపురిత వేదము, లమ్మహనీయు పాదముల్. **(3.541)**

రణరంగంలో హిరణ్యాక్షుడు వరాహమూర్తికి లొంగిపోవటం ఈ క్రింది కందంలో అందంగా వర్ణింపబడింది.

దిట చెడి లోఁబడె దైత్యుఁడు, సటికిన్, దంష్ట్రా విభిన్న శత్రుమహోర
స్తటికిన్, ఖరఖుర పుటికిన్, గటి తట హత కమల జాండ ఘటికిన్, గిటికిన్. **(3.698)**

మైత్రేయ మహర్షి తీర్థ యాత్రలు చేస్తూ శ్రీకృష్ణుని దర్శించిన సందర్భంలోనిది యీ పద్యం.

కనియెం దాపసపుంగవుం డఖిలలోకఖ్యాత వర్ధిష్ణు, శో
భన భాస్వత్పరి పూర్ణ యౌవన కళాభ్రాజిష్ణు, యోగీంద్రహృ
ద్వనజాతైకచరిష్ణుఁ, గౌస్తుభముఖోద్యద్భూషణాలంకరి
ష్ణు, నిలింపాహితజిష్ణు, విష్ణుఁ, బ్రభవిష్ణుం, గృష్ణు, రోచిష్ణునిన్. **(3.148)**

సీసాలలోఅంత్యప్రాస విలాస విన్యాసాలు పోతన్న గారికి ఎంతో ఇష్టం.

దళ దరవింద సుందర పత్ర రుచిరాక్షు సలలిత శ్రీవత్స కలిత వక్షు
నీలనీరద నీలనీలోత్పల శ్యాము నలికులాకుల మాలికాభిరాముఁ
గౌస్తుభకలిత ముక్తాహారయుత కంఠు యోగిమానస పంకజోపకంఠు
సతత ప్రసన్న సస్మితవదనాంభోజు దినకర కోటి సందీప్త తేజు........ **(3.922)**

మరొక విధమైన అనుప్రాసవిన్యాసం కల ఈ సీసాన్ని చిత్తగించండి.

కంజాత కింజల్క పుంజరంజిత పీత కౌశేయవాసు జగన్నివాసు
శత్రు భీకర చక్ర శంఖ గదా పద్మ విహిత చతుర్బాహు విగతమోహు....... (3.924)

ఈ క్రింది ప్రాసముక్తాయింపులు కూర్చటంలో పోతన్న గారిది అందె వేసిన చేయి.

భక్త పరితోషణ భూషణ! పాపశోషణా! (3.115)
కలుష గహనదమునన్ యమునన్. (3.170)
పుండరీకాక్ష! సంతత భువన రక్ష! (3.309)
కృపాగుణ భూషణ! పాపశోషణా! (3.548)
సుధీజనతావన! విశ్వభావనా! (3.570)
జగత్పరిపాలన! నిత్యఖేలనా! (3.572)
రిపుమాన విమర్దను నా జనార్దనున్. (3.666)
వివేక విశాలుని పుణ్యశీలునిన్. (3.707)

ఈ విధంగా బమ్మెరవారి భాగవతం అర్థగాంభీర్యానికి, శబ్ద సౌందర్యానికీ, భక్తి పరవశత్వానికి, మహత్త్వ కవిత్వ పటుత్వానికి ఆలవాలమై అలరారుతున్నది.

ఇటువంటి పోతన భాగవతం అక్షరాస్యులందరికి అందుబాటులో ఉండే విధంగా సరళ గద్యానువాద సహితంగా ప్రకటించాలనే సంకల్పం తిరుమల తిరుపతి దేవస్థానాల వారికి కలగటం అభినందించ వలసిన విషయం. ఈ సదుద్దేశంతోనే పోతన భాగవతం ప్రాజెక్టు ప్రారంభింపబడింది. ఈ మహాకార్యంలో నాకు అవకాశం కల్పించిన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎస్. లక్ష్మీనారాయణ, ఐ. ఏ. ఎస్., గారికి నా హృదయ పూర్వక నమస్సుమనస్సులు సమర్పిస్తున్నాను.

ఈ సందర్భంలో నన్ను అహ్వానించి అనువాద భాగా లన్నింటినీ పరిశీలించి పరిష్కరించి ఏక సూత్రతను కల్పించేభారం నామీద ఉంచిన డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తి, పి. ఆర్. ఓ., గారికి నా అభివందన మందారాలు అందిస్తున్నాను.

ప్రేమ పెన్నిధి అయిన శ్రీనివాసుని సన్నిధిలో ఎంతో సంతోషంతో నేను నా విధిని నిర్వర్తించటానికి సహకరిస్తున్న శ్రీ.కె. సుబ్బారావు, ఎడిటర్ గారికి నా హార్దిక అభివాదాలు.

తమ కరకమలాలను అలంకరించి ఉన్న గ్రంథం పోతన భాగవతం తృతీయ స్కంధం. ఈ స్కంధాన్ని సరళగద్యంలో అనువాదం చేసినవారు శ్రీ ఆశావాది ప్రకాశరావు, ఎం. ఏ., గారు. వీరు చిత్తూరుజిల్లా, నగరి డిగ్రీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులు. అష్టావధానకళలో ఆరితేరినవారు. వినయభూషణులు. మధురభాషణులు.

ఆశావాది వారి అనువాదం సరసంగా సరళంగా సాగింది. ఈ తృతీయ స్కంధాన్ని ఇంత ముచ్చటగా ముద్రించిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ విజయకుమార్‌రెడ్డి గారికి, వారి సిబ్బందికి నా సాధువాదాలు.

అక్షరదోషాలు దొరలకుండా సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన పూజ్యమిత్రులు శ్రీ ముదివర్తి కొండమాచార్యుల వారికీ, శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి గారికీ నా ధన్యవాదాలు. ముద్రణకు తగునట్లు ప్రెస్‌కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఏ., ఎం.ఫిల్.,కు నా శుభాశీస్సులు.

తిరుపతి,
10-2-86.

భవదీయుడు
కరుణశ్రీ
ప్రధాన సంపాదకుడు
పోతన భాగవతం